సాక్షి ఖమ్మం

శుక్రవారం । 26 । మే । 2023



సీఎం సమావేశంలో కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పాల్గొన్నారు.



...అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం

ఖమ్మంలో రెండు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్స్ అథ్లెటిక్ మీట్ గురువారం ప్రారంభమైంది. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం కూడా గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అధికారుల విచారణ

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మైనింగ్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయని.. తద్వారా పర్యావరణానికి నష్టం కలగడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని అందిన ఫిర్యాదులతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) అధికారులు గురువారం విచారణ చేపట్టారు. రఘునాథపాలెంతో పాటు ఇతర ప్రాంతాల్లో మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టగా ఇప్పటికే తాము లోకాయుక్తలో వేసిన ఫిర్యాదుతో రూ.16 కోట్లు జరిమానా విధించినా తవ్వకాలు ఆగలేదని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టుకు ఫిర్యాదు చేశామని జిల్లాకు చెందిన మందా బుచ్చిబాబు, కోయిన్ని వెంకన్న తెలిపారు. దీంతో అధికారులు వీడియో ద్వారా న్యాయవాది రమేష్‌బాబు పర్యవేక్షణలో విచారణ చేపట్టడంతో వివరాలు వెల్లడించామని పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎన్‌జీటీ అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా అధికారులను ఆదేశించారని తెలిపారు.

జాబ్‌మేళాలో 35 మంది ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 35మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయి. ఐటీఐ అభ్యర్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 52 మంది హాజరయ్యారని జిల్లా అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు.

గొర్రెల పంపిణీ నిధులు కేంద్రం ఇవ్వాలి

- డీసీసీబీ చైర్మన్ నాగభూషణం



వాహనాలను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ నాగభూషణం

కూసుమంచి: గొల్ల, కురుమలకు గొర్రెలను పంపిణీ చేసేందుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థకు కేంద్రప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం డిమాండ్ చేశారు. రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, యాదవులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో గురువారం చేపట్టిన ధర్నాకు జిల్లాకు చెందిన యాదవులు వాహనాల్లో బయలుదేరారు. వాహన శ్రేణిని ఆయన కూసుమంచిలో ప్రారంభించి మాట్లాడారు. గొర్రెల పంపిణీకి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించిందని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ప్రతిపాదనలు పంపి ఏడాది దాటినా విడుదల చేయలేదని చెప్పారు. ఫలితంగా గొల్ల, కురుమలు నష్టపోతున్నందున కేంద్రం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బారి మల్సూర్, మేకల నాగేశ్వరరావుతో పాటు వీరస్వామి, రాము, నర్సింహారావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

హైవేల ప్రతిపాదనలు ఏమయ్యాయి ?

- పాపటపల్లి – మిర్యాలగూడ రైల్వేలైన్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలి
- రైల్వే అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరించొద్దు..
- 'దిశ' కమిటీ సమావేశంలో చైర్మన్, ఎంపీ నామ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న చైర్మన్, ఎంపీ నామ నాగేశ్వరరావు పక్కన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు ఉపేందర్‌రెడ్డి, రాములునాయక్, అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్ తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని చాలాప్రాంతాల్లో జాతీయ రహదారుల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పంపిన ప్రతిపాదనల్లో ఎన్ని మంజూరయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. వాటి పురోగతి ఏమిటి... అని దిశ కమిటీ చైర్మన్, ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రశ్నించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన దిశ కమిటీ సమావేశంలో జాతీయ రహదారులు, పంచాయతీరాజ్, జలవనరులు, విద్యుత్, మున్సిపల్, రైల్వే, డీఆర్డీఏ, వైద్య ఆరోగ్య, పరిశ్రమల శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో కొత్త రహదారుల కోసం రూ.2,114 కోట్లతో ప్రతిపాదించగా, ఖమ్మం–కురవి జాతీయ రహదారి అభివృద్ధికి రూ.124.80 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ మార్గంలోని మండల కేంద్రాల్లో నాలుగు లైన్ల రోడ్లు, సెంట్రల్ లైటింగ్‌కు నిధులు విడుదలయ్యాయని తెలిపారు. జిల్లాలో కొత్త పరిశ్రమలు రావాలని తద్వారా అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. త్వరలోనే ఖమ్మంలో సీఐఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



ఇబ్బంది లేకుండా రైల్వేలైన్

పాపటపల్లి–మిర్యాలగూడ నూతన రైలు మార్గాన్ని అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో నిర్మించాలని ఎంపీ రైల్వే ఉన్నతాధికారులకు సూచించారు. తొలుత ప్రతిపాదించినట్లుగా నిర్మిస్తే ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లోని 12 గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు, చిన్న సన్నకారు రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయమై కేంద్ర రైల్వే మంత్రి, రైల్వే బోర్డు చైర్మన్, జనరల్ మేనేజర్లకు లేఖలు రాయగా.. మళ్లీ సర్వే చేయాలని కోరినట్లు తెలిపారు. వీలుంటే ఖమ్మం జిల్లాతో సంబంధం లేకుండా రైలు మార్గాన్ని నిర్మించే యోచన చేయాలని రైల్వే ఉన్నతాధికారి రామారావుకు సూచించారు. ఇక రైల్వే అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, పనుల ప్రారంభం, ఇతర విషయాలపై తనకు సమాచారం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ధంసలాపురం, సారథినగర్ ఆర్వోబీ పనులు, అండర్‌పాస్‌లు, బ్రిడ్జిల సంగతేమైందని రైల్వే అధికారులను నిలదీశారు. వచ్చే సమావేశానికి పూర్తి నివేదికలతో రావాలన్నారు. అనధికార లేఔట్లు, కాల్వల పూడ్చివేతపై చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సమస్యలు ఉన్నచోట సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ సూచించారు. ఇంకా ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, ట్రెయినీ కలెక్టర్ మయాంక్ సింగ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్‌ఎల్‌ఎన్‌ఏ జాయింట్ కమిషనర్, దిశ కమిటీ సభ్యులు ఎం.శేషుకుమార్, నామినేటెడ్ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంకా ఎవరేం అన్నారంటే...

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ తెలంగాణ పారిశ్రామికంగా పురోగమించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి, మంత్రి కేటీఆర్ కృషి ఉందని తెలిపారు. వైద్య రంగంలో రాష్ట్రం చాలా అభివృద్ధి సాధించిందని, ఇంకా ఏమైనా అవసరాలు ఉంటే ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.
- పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ నాయుడుపేట చౌరస్తా నుండి రాపర్తినగర్ వరకు, పాన్నెకల్ నుండి మద్దులపల్లి వరకు రోడ్డు విస్తరణ చేయాలని కోరారు. మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, రైల్వే లైన్ ఏర్పాటులో రైతుల భూములు ప్రభావితం కాకుండా చూడాలని కోరారు. అలాగే, కామంచికల్ దగ్గర రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం మూసేసిన గేట్ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు.
- వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, బ్రౌన్స్ పాఠశాల నుండి తనికెళ్ల స్టేజి, పల్లిపాడు రహదారులు అభివృద్ధి చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.
- జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ మాట్లాడుతూ మధిర, పాతర్లపాడు, రాంపురం క్రాస్ రోడ్డు వద్ద ప్రజల సౌకర్యార్థం రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు.

బీజేపీని ఓడించడమే కర్తవ్యం

- కమ్యూనిస్టులు స్వతంత్రంగా పోటీ చేస్తే మద్దతు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలు వచ్చినప్పుడే తమ పార్టీ చర్చించి విధివిధానాలను ప్రకటిస్తుందని.. ప్రస్తుతం దేశానికి బీజేపీతో పొంచి ఉన్న ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుగానే ఆ పార్టీని ఓడించాలనే స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు వెల్లడించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞానకేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే యువత, ప్రజలకు పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. కాగా, ఖమ్మంలో మూడు రోజుల పాటు జరిగిన పార్టీ ఏడో రాష్ట్ర మహాసభల్లో బీజేపీని ఓడించాలని తీర్మానించినట్లు తెలిపారు. కాగా, కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల సమయంలో ఏదో ఒక బూర్జువా పార్టీతో పొత్తులు పెట్టుకుంటాయని, అలా కాకుండా స్వతంత్రంగా పోటీ చేస్తే తమ పార్టీ మద్దతు ఉంటుందన్నారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా ప్రజల ఆకాంక్షలు నెరవేరనందున వచ్చేనెల 2 నుండి 12వ తేదీ వరకు ప్రజాపంథా ఆధ్వర్యాన దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పది రోజుల పాటు కార్యక్రమాలు చేపట్టి, 12న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, దీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు.

విజయవంతంగా రాష్ట్ర మహాసభల

ప్రజాపంథా రాష్ట్ర ఏడో మహాసభలు ఈనెల 22 నుండి 24వ తేదీ వరకు డీవీకే.నగర్‌లో విజయవంతంగా జరిగాయని రంగారావు తెలిపారు. వివిధ జిల్లాల నుండి 189 మంది, 25 మంది సౌహార్ద ప్రతినిధులు హాజరయ్యారన్నారు. ఈమేరకు పార్టీ కార్యక్రమం, విప్లవ పంథా, నిబంధనావళి, రాజకీయ నిర్మాణ సమీక్షపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించామని తెలిపారు. అలాగే, పార్టీ రాష్ట్ర నూతన కమిటీని 29 మందితో ఎన్నుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో నాయకులు కెచ్చల రంగయ్య, రాయల చంద్రశేఖర్, కె.రమ, ఎస్‌ఎల్.పద్మ, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీ.వై.పుల్లయ్య, ఆవుల అశోక్, ఆర్.శివలింగం తదితరులు పాల్గొన్నారు.

గుండె'కోత' తప్పినట్లే..

- సీతారామ ప్రాజెక్టులో సొరంగ మార్గం నిర్మాణంతో రైతుల్లో ఆనందం
- అధికారుల కృషి, ఎమ్మెల్యే కందాళ సహకారంతో కార్యరూపం
- గణనీయంగా తగ్గనున్న భూసేకరణ, నిర్మాణం వ్యయం
- 546 ఎకరాల రక్షణతో పాటు రూ.370 కోట్లు ఆదా



సొరంగ మార్గం నిర్మించే ప్రాంతం

తిరుమలాయపాలెం: సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో డిజైన్ మార్పుతో భూనిర్వాసితులుగా మిగలాల్సిన రైతులకు ఊరట లభిస్తోంది. జలవనరుల శాఖ అధికారులు చేసిన సొరంగ మార్గం ప్రతిపాదనతో విలువైన భూమి కోల్పోకుండానే పంట చేలకు నీరు అందనుంది. గతంలో కరువుతో అల్లాడిన తిరుమలాయపాలెం మండలంలో భక్తరామదాసు ప్రాజెక్టు నిర్మాణంతో ఇప్పుడిప్పుడే పంటలు పండుతున్నాయి. ఈ తరుణాన సీతారామ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోవాల్సిన పరిస్థితితో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఇంతలోనే సొరంగ మార్గం ప్రతిపాదనకు ఆమోదం లభించడంతో రైతులకు గుండెకోత తప్పినట్లయింది.

ఇదీ ప్రత్యామ్నాయం

సీతారామ ప్రాజెక్టులో భాగంగా తొలుత కాల్వ నిర్మించాలని డీపీఆర్ రూపొందించారు. తద్వారా రైతులు సారవంతమైన, విలువ కలిగిన భూములు కోల్పోనుండడంతో అధికారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించారు. జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, డీఈ బాణాల రమేష్‌రెడ్డి, ఇతర అధికారులు కాళేశ్వరం ప్రాజెక్టు తరహాలో సొరంగ మార్గం తవ్వాలని నిర్ణయించి పరిస్థితులను అధ్యయనం చేశారు. ప్యాకేజీ 16లో పాతర్లపాడు–దమ్మాయిగూడెం మధ్య సొరంగ మార్గం (టన్నెల్) ద్వారా నీరు పంపొచ్చనే భావనకు వచ్చిన వారు పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సేకరించాల్సిన భూమి, చెల్లించాల్సిన పరిహారమే కాక నిర్మాణ వ్యయం తగ్గుతుందని.. సుమారు రూ.370 కోట్లు ఆదా చేయొచ్చని చెప్పగా ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివరాలు సమర్పించారు. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ సొరంగ మార్గం నిర్మాణానికి ఆమోదం తెలపగా ఇన్నాళ్లు ఆందోళనకు గురైన రైతులు ఊపిరి పీల్చుకున్నారు. భూమినే నమ్ముకున్న తమకు ప్రభుత్వం అందించే పరిహారంతో మరో అర ఎకరం కూడా దొరకదని ఆవేదనకు గురైన వారిలో ఇప్పుడు ప్రశాంతత నెలకొంది.



సొరంగ మార్గంతో సమయం, ఖర్చు ఆదా

మండలంలోని బీరోలు, మేడిదపల్లి, జింకలగూడెం, తాళ్లచెరువు, ఏలువారిగూడెం, పోచారంలో చేయాల్సిన భూసేకరణ చాలా వరకు తగ్గుతోంది. అలాగే సొరంగ మార్గంతో నిర్మాణ పొడవు తగ్గింది. భూసేకరణ వ్యయం, ప్రాజెక్టు నిర్మాణ వ్యయం తగ్గడమే కాక సమయం ఆదా కానుంది. కాల్వ నిర్మాణానికి మూడున్నరేళ్లు పట్టనుండగా.. సొరంగ మార్గం 18 నెలల్లోనే పూర్తవుతుందని చెబుతున్నారు. టన్నెల్‌లో ఎప్పుడూ నీరు నిల్వ ఉండడంతో ఇక్కడ భూగర్భ జలాలకు ఢోకా ఉండదని అధికారులు తెలిపారు.

ఇవీ తేడాలు

కాల్వ నిర్మాణానికి 655 ఎకరాల భూమి అవసరమయ్యేది. కానీ సొరంగమార్గానికి 88 ఎకరాలు సరిపోతుంది. కాల్వను 14.2 కిలోమీటర్ల మేర నిర్మించాలని భావించగా.. ఇప్పుడు సొరంగం 12.7 కిలోమీటర్లతో పూర్తవుతుంది. అలాగే, భూసేకరణ వ్యయంలో రూ.110కోట్లు, నిర్మాణ వ్యయం రూ.200 కోట్లు, ఆర్‌ఆర్ స్ట్రక్చర్‌లో రూ.60కోట్లు కలిపి మొత్తం రూ.370 కోట్ల నిధులు ప్రభుత్వానికి ఆదా కానున్నాయి.

భూములు కాపాడే ఆలోచనతోనే..



వేరే చోట భూములు లభించక నిర్వాసిత రైతులు పడుతున్న కష్టాలు నా దృష్టికి వచ్చాయి. సొరంగ మార్గం ద్వారా భూములను కాపాడడమే కాక నిధులు ఆదా అవుతాయనే ఇరిగేషన్ అధికారుల ప్రతిపాదనను సీఎం కేసీఆర్‌కు వివరిస్తే అంగీకరించారు. దీంతో సీఎంకు రైతులపై ఉన్న గౌరవం వెల్లడి కాగా.. 546 ఎకరాలు కాపాడి భావితరాలకు అందించిన తృప్తి నాకు మిగిలింది.

– కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, పాలేరు

ఆనందంగా ఉంది...



ఇప్పటికే తిరుమలాయపాలెం మండలంలో ఎస్సారెస్పీ, తానంచర్ల, భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా రైతులు భూమి కోల్పోయారు. సీతారామ ప్రాజెక్టుతో మళ్లీ కోల్పోతుండడంతో సొరంగ మార్గం ఆలోచన వచ్చింది. ఉన్నతాధికారులతో చర్చించి ప్రణాళికను ఎమ్మెల్యే కందాళ ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో వందలాది ఎకరాల భూమిని కాపాడిన తృప్తి కలుగుతోంది.

– బాణాల రమేష్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ

14 ఎకరాల భూమి దక్కింది..



సీతారామ ప్రాజెక్టు కింద 14 ఎకరాల మేర భూమి కోల్పోవాల్సి వచ్చింది. ప్రభుత్వం ఇచ్చే ధరతో ఎక్కడా భూమి దొరికే పరిస్థితి లేదు. భూమిని కోల్పోతే జీవనం ఎలాసాగుతుందని మథనపడ్డాను. ఇరిగేషన్ అధికారుల కృషి, ఎమ్మెల్యే కందాళ చొరవతో టన్నెల్ మార్గం నిర్మాణానికి సిద్ధమవడంతో మా భూములు మాకే దక్కాయి.

– పోలంపల్లి అప్పారావు, రైతు, పోచారం, కూసుమంచి మండలం

సారవంతమైన భూములు మిగిలాయి



మిర్చి, పత్తి పంటలకు అనుకూలమైన సారవంతమైన భూములు కోల్పోతానని బాధపడ్డాను. భూమి తీసుకుని ఇచ్చే పరిహారం డబ్బులతో ఏం చేసుకోవాలో దిక్కుతోచలేదు. ఇంతలోనే సొరంగ మార్గం నిర్మిస్తామని చెప్పడంతో ప్రాణం లేచివచ్చినట్లయింది. రైతుల కష్టాలను గుర్తించి భూములు కాపాడిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– కొప్పుల శ్రీనివాసరెడ్డి, రైతు, బీరోలు, తిరుమలాయపాలెం మండలం

రేపు బీజేపీ నిరుద్యోగ మార్చ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

ఖమ్మం మయూరిసెంటర్: బీజేపీ ఆధ్వర్యాన ఖమ్మంలో ఈనెల 27న శనివారం నిర్వహించే నిరుద్యోగమార్చ్‌ను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ కోరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అల్లిక అంజయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి కారణంగా లక్షలాది మంది నిరుద్యోగులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. ఈమేరకు మంత్రి కేటీఆర్ రాజీనామా చేయడంతో పాటు లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని డిమాండ్‌తో చేపడుతున్న నిరుద్యోగ మార్చ్ ఖమ్మం జెడ్పీ సెంటర్ నుండి పాత బస్టాండ్ వరకు కొనసాగుతుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తదితరులు హాజరయ్యే ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులే కాక నిరుద్యోగ యువత పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు కాసం వెంకటేశ్వర్లు, ఉదయ్‌ప్రతాప్, ఉప్పల శారద, రమేష్, రుద్ర ప్రదీప్, మందా సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, వెంకట్, శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, తెలంగాణలో నిరుద్యోగ సమస్యపై బీజేపీ నాయకుడు దేవకి వాసుదేవరావు ఆధ్వర్యాన ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్, ఓయూ విద్యార్థి ఉద్యమనేతలు దరువు ఎల్లన్న, పుల్లారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కుమార్ హాజరై మాట్లాడారు. నాయకులు డాక్టర్ శీలం పాపారావు, గెంటెల విద్యాసాగర్, నున్నా రవి, శ్రీదేవి, రవీందర్, రాజేష్, మృత్యుంజయ్, వీరభద్రం పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో ఇళ్ల తొలగింపు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరం గ్రామంలోని ఆరు ఎకరాల అసైన్డ్ భూముల్లో కొందరు ఇళ్ల నిర్మాణం చేపట్టి భూములను ఆక్రమించుకున్నారని కలెక్టర్ గౌతమ్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్ నారపోగు అరుణ, ఆర్‌ఐ శ్రీనివాస్, సిబ్బందితో వెళ్లి కలిసి ఇళ్ల తొలగింపు చేపట్టారు. ఈమేరకు 50 ఇళ్లు, గడ్డివాములు తొలగించి స్థలాలు ఆక్రమించుకున్న వారికి నోటీసులు జారీ చేశారు.



ఇళ్లు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రెండేళ్లుగా సాగదీతతోనే సరి

- డీసీసీబీ అక్రమాలపై 29నుంచి మరోసారి విచారణ
- కోర్టు స్టేలతో గైర్హాజరవుతున్న పలువురు



ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో చోటు చేసుకుంటున్న అవినీతి అక్రమాలు విచారణలకే పరిమితమవుతున్నాయి. తప్పుడు ధృవీకరణ పత్రాలతో రూ.కోట్లలో రుణాలు పొందిన అక్రమార్కులపై ఈనెల 29నుంచి విచారణ జరపనున్నట్లు రాష్ట్ర సహకార బ్యాంక్(టస్కాబ్) నోటీసులు జారీ చేసింది. అయితే, ఏడేళ్ల క్రితం చోటుచేసుకున్న అక్రమాలపై రెండేళ్లుగా విచారణలకే పరిమితమవుతుండడం, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కోర్టు స్టే తెచ్చుకుని గైర్హాజరవుతుండడంతో ఎటూ తేలడం లేదు. ఏడేళ్ల క్రితం డీసీసీబీ పరిధి ఖమ్మంలోని పలు బ్రాంచ్‌ల్లో మార్ట్‌గేజ్ రుణాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. నగరంలోని ఎన్‌ఎస్‌టీ, ప్రధాన కార్యాలయం, రోటరీనగర్ బ్రాంచ్‌ల్లో నకిలీ ధృవపత్రాలు తనఖా పెట్టి ఇరవై మంది రూ.4.50కోట్ల మేర మార్ట్‌గేజ్ రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. ఇది కూడా 2020వ సంవత్సరంలో అధికారుల నడుమ విభేదాలతో బయటపడింది. అదే ఏడాది కూరాకుల నాగభూషణం చైర్మన్‌గా నూతన పాలకవర్గం ఎన్నిక కాగా, సీఈఓగా అట్లూరి వీరబాబు నియమితులయ్యారు. దీంతో ఓ ఏజీఎంతో విచారణ కమిటీ నియమించగా దస్తావేజులు, స్థిరాస్తులను పరిశీలించారు. దీంతో నకిలీ ధృవీకరణ పత్రాలు సమర్పించిన వారిపై పోలీసు కేసులు నమోదయ్యాయి. ఆ కేసులు ఇంకా కొనసాగుతున్నాయి. గత ఏడాది బ్యాంకు పర్యవేక్షణకు వచ్చిన నాబార్డ్ అధికారులు నకిలీ ధృపత్రాలతో రుణాలు తీసుకున్న వ్యవహారాన్ని పరిశీలించి డీసీసీబీలోనూ అవకతవకలు జరిగాయని గుర్తించారు. ఈక్రమంలో నకిలీ డాక్యుమెంట్ల అంశంపై రాష్ట్ర ఫైనాన్స్ బ్యాంక్ తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ యాక్ట్ ఆధారంగా చర్యలకు ఆదేశించడంతో టస్కాబ్ డీజీఎం బందెల అంజయ్యతో కూడిన బృందాన్ని నియమించారు. సదరు బృందం గత మార్చిలో మూడు రోజుల పాటు విచారణ జరిపినా పలువురు హాజరుకాలేదు. దీంతో మరోమారు ఈనెల 29నుంచి జూన్ 2వ తేదీ వరకు విచారణ జరపాలని నిర్ణయించి 35 మందికి నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై జిల్లా సహకార అధికారి విజయకుమారిని వివరణ కోరగా, డీసీసీబీలో నకిలీ ధృవీకరణ పత్రాలతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగమైన అంశంపై రాష్ట్ర సహకార శాఖ కమిషనర్‌కు నివేదిక ఇచ్చామని తెలిపారు. అలాగే, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నుంచి నివేదిక అందిస్తే సమగ్ర చర్యలు తీసుకునే అవకాశముందని చెప్పారు.

క్లుప్తంగా

డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా రామారావు


రామారావును సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బోయినపల్లి రామారావు గౌడ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు ఎం.డీ.అబ్దుల్ హాకీం హజ్ యాత్రకు వెళ్తుండడంతో అసోసియేట్ అధ్యక్షులు రామారావుకు బాధ్యతలు అప్పగించారు. ఈకార్యక్రమంలో ఎం.డీ.హకీం, హరినాథ్‌రెడ్డి, కె.కోటేశ్వరరావు, ఎం.డీ.సలీం, వేణుగోపాల్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

పని లేదనడంతో వెనక్కి..


వెనుతిరిగిన ఉపాధి హామీ కూలీలు

కల్లూరు రూరల్: వేసవిలో అడిగిన వారందరికీ ఉపాధి హామీ పథకంలో భాగంగా పని కల్పించాలని అధికారులు సూచిస్తున్నా అక్కడక్కడా వారికి చుక్కెదురవుతోంది. కల్లూరు మండలం పేరువంచలో గురువారం 220మంది కూలీలు పనులకు వెళ్లారు. అయితే, ట్రాక్టర్లు రాలేదని, పని లేదని ఉపాధి హామీ వారికి చెప్పారు. ఎండలో మూడు గంటల పాటు వేచి చూసినా పట్టించుకోవడంతో కూలీలు వెనుదిరిగారు.

ఎండు గంజాయి స్వాధీనం


నిందితులు, గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: నగరంలోని టేకులపల్లి ఎన్నెస్పీ బ్రిడ్జి సమీపాన అమ్మకానికి సిద్ధంగా ఉన్న 1.1 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. టేకులపల్లి ఎన్నెస్పీ బ్రిడ్జి సమీపాన ఎండు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కొల్లాపూడి సురేష్ అలియాస్ మనోహర్, ఏపూరి ఉదయ్ అలియాస్ చిన్ను, గందమల్ల పవన్ కళ్యాణ్ రెండు బైక్‌లపై పారిపోతుండగా అడ్డుకుని తనిఖీ చేయగా 1.1 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది.. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం-1 ఎక్సైజ్ సీఐ కె.రాజు తెలిపారు. కాగా, ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంకు చెందిన వీరు కొన్ని రోజులుగా ఎన్నెస్పీ కెనాల్ పరిసరాల్లో ఎండు గంజాయిని అమ్ముతున్నట్లు చెప్పారు. తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు వి.రవి, షేక్ రబ్బానీ, రామారావు, శశికాంత్, రమేష్, మారేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

మంత్రిని దూషించిన వ్యక్తిపై కేసు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆయన తండ్రి నాగేశ్వరరావును సామాజిక మాధ్యమాల వేదికగా దూషించిన వ్యక్తిపై కేసు నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కార్తీక్ ఫేస్‌బుక్‌లో మంత్రిని దూషిస్తూ కామెంట్లు పెట్టడంతో బీఆర్‌ఎస్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

పెళ్లయిన నాలుగో రోజే అదృశ్యం

ఏన్కూరు: ఓ యువతి వివాహమైన నాలుగో రోజునే ఇంటి నుంచి వెళ్లిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన కావ్యశ్రీకి ఏన్కూరు ఇందిరానగర్ కాలనీకి చెందిన సాయితో ఈ నెల 20వ తేదీన వివాహం జరిగింది. అయితే, 23న అర్ధరాత్రి సాయి ఇంటి నుంచి కావ్యశ్రీ వెళ్లిపోయింది. అప్పటి నుంచి బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేదు. కావ్యశ్రీ తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు.

యువకుడు ఆత్మహత్య..?

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన యువకుడు గోగుల సాయి (17) గురువారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో వద్ద అతని చెప్పులు కనిపించడంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానిస్తున్నారు. గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లు బావిలో గాలింపు కొనసాగిస్తున్నారు. గతేడాది సోదరుడు ఆత్మహత్య చేసుకున్న నాటి నుంచి సాయి ముభావంగా ఉంటున్నాడని, ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షలకు కూడా గైర్హాజరయ్యాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

ఎంసెట్‌లో జిల్లాకు ర్యాంకులు

ఎంసెట్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఆయా విద్యార్థులను కళాశాలల యజమాన్యాలు అభినందించాయి.
– ఖమ్మం సహకారనగర్


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్, పక్కన డైరెక్టర్లు

● న్యూవిజన్‌దే అగ్రస్థానం

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో అగ్రస్థానంలో నిలిచారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే. ప్రసాద్ తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించి వివరాలు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో జి.నీరజ్‌రెడ్డి 98వ ర్యాంక్, ఎం.సుష్మ శ్రీ 120, డి.ధనుష్ 129, బి.రిత్విక్ 174, కె.భవ్య 196, వి.వెంకటసాత్విక్ 249, డి.సాయిశ్రీరాం 337, కె.యశ్వంత్ 364, పి.వరుణ్ 386, పి.రాహుల్ 387, కె.హర్షితశ్రీ 396, టి.జస్మిత 436, పివి.చాణిక్య 437, సోబియా తానజాలీ 551, పి. రోహిత్‌సాయి అన్వేష్ 571, పి.రోహిత్ 618, ఆర్. విష్ణు నాగ నితిన్ 623, పి.ఉభయేంద్ర 688, కె.కమలిక 739, పి.మురారి 756, పి.భావన 792, కె.లిఖిత పవన్ 835, ఎం.దైనతేజ 905, టి.చేతన్ 920, ఎస్.కే.మహతాబ్ 970, గణేష్‌సాయి 981, కె.కౌషిక్ 1,367, పి.బిన్ను 1,418, వి.శ్రీవర్షిత 1,446, ఎస్.ఉదీత్‌చౌదరి 1,475, సీహెచ్.సత్యనారాయణ 1,492వ ర్యాంక్ సాధించారన్నారు. ఇంజనీరింగ్ విభాగం నుంచి 450మంది, అగ్రికల్చర్ నుంచి 80 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 10వేల లోపు 125మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. డైరెక్టర్లు సీహెచ్.గోపీచంద్, సీహెచ్.కార్తీక్ మాట్లాడుతూ పరిమిత సంఖ్యలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించటం ద్వారానే మెరుగైన ఫలితాలు వచ్చాయని చెప్పారు. ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


విజయచిహ్నం చూపిస్తున్న డైరెక్టర్ శ్రీవిద్య, విద్యార్థులు, అధ్యాపకులు

ఎంసెట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు అభినందించి మాట్లాడారు. బి.వివేక్ వర్ధన్‌వర్మ 139వ ర్యాంక్, కె.జన్వితాదేవి 199, బి.జశ్వంత్ కుమార్ 245, ఏ.ఇందు 258, టి.శ్రీతేజ 261, ఎస్.కే.ఆర్షియా నౌరిన్ 314, పి.హర్షిత్ చౌదరి 351, సీహెచ్.సహస్ర 409, కె.కీర్తనవర్మ 490, పి.సాయినిఖితరెడ్డి 527, టి.హర్షవర్ధన్ 790, వి.భరత్ 791, కె.శివగుప్త 858, బి.పూజిత 871, సీహెచ్.సాత్విక 915, ఆర్.బీ.రాంచరణ్ 957, బి.అక్షిత 969వ ర్యాంక్ సాధించారని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ బి.సాయిగీతిక, డీజీఎం సీహెచ్.చేతన్‌మాథుర్, అకడమిక్ డీన్ ఎస్ఆర్ ఎస్‌డీ.వర్మ, ఏజీఎంలు సీహెచ్.బ్రహ్మం, జి.ప్రకాష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● కృష్ణవేణి విజయఢంకా


విద్యార్థులను అభినందిస్తున్న యజమాన్యం, అధ్యాపకులు

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయఢంకా మోగించారని కృష్ణవేణి కళాశాల డైరెక్టర్లు గొల్లపుడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కె.చందన 948వ ర్యాంక్, ఈ.శ్రీకాంత్ 1,126, డి.విజయ్ కుమార్ 2,351, టి.నేహశ్రీ 2,386, జి.చైతన్య 2,540, సీహెచ్.రోహిత 2895, ఏ.సతీష్ 3,043, పి.నిఖిలశ్రీ 5,078, బి.వాసు 5229, పి.శ్వేతారెడ్డి 5,479, ఎస్.కే.షాహీన్ 5,483, ఐ.రిషిత 6,490, డి.నిఖిత 6,776, ఆర్.బృందావని 6,831, బి.రాకేష్ 6,846, బి.జయశ్రీ 7,103, ఎస్.వెంకటసాయితేజ 7,534, కె.స్వాతి 7,783, వి.తేజ 8,135, టి.శ్రేష్ఠ 8,194, డి.అఖిల 8,754, పి.సాయికృష్ణ 8,614, జి.పవిత్ర 8,749, డి.ధర్మతేజ 9,438, టి.కోమలి 9,827, ఆర్.సాయి 9,979వ ర్యాంక్ సాధించారన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, అకడమిక్ డీన్ శేఖర్‌బాబు, అకడమిక్ ఇన్‌చార్జ్ వంశీకృష్ణ, ఏఓ నిరంజన్ కుమార్ పాల్గొన్నారు.

● రెజొనెన్స్ విజయభేరి


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

టీఎస్ ఎంసెట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని రెజొనెన్స్ కళాశాలల డైరెక్టర్లు ఆర్.వీ. నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించాక వారు మాట్లాడారు. ఇంజనీరింగ్ విభాగంలో పి.లక్ష్మీసాయి 1,048వ ర్యాంక్, టి.శ్రీమౌక్తిక 1,696, జోషిక శివాని 2,905, రాజేష్ 3,973, అస్మ 5,447, మిదిలేష్ వర్ధన్ 5,940, పవన్ సాయితేజ 6,520, మెడికల్, అగ్రికల్చర్ విభాగంలో నాజియ అంజుమ్ 1,023, చంద్రికలక్ష్మి 3,993, బి.వినీల 4,077, అమన్ 7,895, సాయినేహ 7,989, బీణ 7,930 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సతీష్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

● హార్వెస్ట్‌కు ర్యాంకుల పంట


విద్యార్థులతో కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

ఎంసెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. ఉదారపు మోహన్‌సాయి 256వ ర్యాంక్ సాధించగా, టి.చేతన్ తన్మయి 1679వ ర్యాంక్, ఉప్పలపాటి హరిదీప్‌సాయి 1994 వి.గాయత్రి, కృష్ణ 2828, సీహెచ్.షణ్ముఖ నిరూప్ 2925, జి.రిషిత 2,996, ఎస్.పల్లవి 3,135వ ర్యాంక్ సాధించారని చెప్పారు. ఇంజనీరింగ్ విభాగంలో మొత్తం 190మందికి 300లోపు ర్యాంక్ ఒకరు, 4వేల లోపు ర్యాంక్ 11మంది, 5వేల లోపు 14మంది, 10వేల లోపు 35, 25వేల లోపు ర్యాంకులు 48మంది సాధించారన్నారు. అలాగే, మెడికల్, అగ్రికల్చర్ విభాగంలో పరీక్షకు 39మంది హాజరుకాగా ఆరేపల్లి త్రినాథ్ 772వ ర్యాంక్, జె.షరోన్ జకులైన్ 1,501, ఎస్.అక్షర సంక్రాంతి 2,436, కె.గీతిక 2533, వి.సృజన 5,750వ ర్యాంక్ సాధించారని తెలిపారు.

● వెలాసిటీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న రవి, యాకుబ్, లక్ష్మణ్‌రావు తదితరులు

ఎంసెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని వెలాసిటీ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ మల్లోలు రవి, అకడమిక్ డీన్ మహ్మద్ యాకూబ్, ప్రిన్సిపాల్ శెట్టి లక్ష్మణ్‌రావు తెలిపారు. ఈమేరకు విద్యార్థులను అభినందించాక వారు వివరాలు వెల్లడించారు. కె.విద్య 1,239వ ర్యాంక్, వి.దివ్య 1,657, పి.రాగిణి 2,345, బి.మంజుల 3,245, ఏ.రాజు 4,596, బి.లోకేష్ 5,657, కె.యశ్వంత్ 7,254, ఎన్.పూజిత 8,749, ఎస్.సౌమ్య 9,437, ఆర్.హరికృష్ణ 12,129, డి.భార్గవ్ 13,456, ఈ.వెంకటేశ్వర్లు 20,359వ ర్యాంక్ సాధించారన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం

- 250 మందికి పైగా అథ్లెట్ల హాజరు
- పోటీలను ప్రారంభించిన అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి తదితరులు


100 మీటర్ల పరుగులో లక్ష్యాన్ని చేరుకుంటున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి 9వ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.సారంగపాణి, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మహీధర్, జిల్లా చైర్మన్ నున్నా రాధాకృష్ణ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ ఒత్తిడికి లోను కాకుండా ప్రతిభను మెరుగు పరుచుకునేందుకు అథ్లెట్లు కృషి చేయాలన్నారు. దక్షిణ భారతదేశంలో తమిళనాడుతో పోటీ పడుతున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తెలిపారు. ఇదేవిధంగా ప్రతిభను మెరుగుపరుచుకుంటే దేశానికి మరిన్ని పతకాలు సాధించొచ్చని చెప్పారు. డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు రాణించేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 250మంది పురుషులు, మహిళలు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ గౌస్‌తో పాటు వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లెంపాటి సత్యనారాయణ, దుర్గ, ఎం.సుధాకర్, కృష్ణయ్య, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు వీరే..

రెండు రోజులపాటు జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో భాగంగా గురువారం తొలిరోజు ఈవెంట్లలో గెలుపొందిన వారి వివరాలిలా ఉన్నాయి. పురుషుల 100 మీటర్ల పరుగు పందెంలో మనే దినేష్(రంగారెడ్డి), ఎస్.కే.లాల్‌పాషా, చింత నవీన్‌కుమార్(ఖమ్మం), 800 మీటర్ల పరుగులో వర్సరాజు(భద్రాద్రి కొత్తగూడెం), కుసం రవి (జయశంకర్ భూపాలపల్లి), పి.సందీప్(హన్మకొండ), 5వేల మీటర్ల పరుగులో సురభ్(తెలంగాణ అథ్లెటిక్స్ అకాడమీ–టీఏఏ), ఎం.వినయ్(కరీంనగర్), వి.ధనుష్(నల్లగొండ), డిస్కస్ త్రోలో అజయ్‌కుమార్(టీఏఏ), సీహెచ్.ప్రశాంత్(ఖమ్మం), వి.త్రికంకుమార్(పెద్దపల్లి), హైజంప్‌లో జె.అనారాధన్(నారాయణపేట), ఎం.పరమేష్(సూర్యాపేట), ఎం.ప్రభాకర్‌రావు(జయశంకర్ భూపాలపల్లి), ట్రిపుల్ జంప్‌లో అభిషేక్(టీటీఏ), ఎర్రోళ్ల తేజ(మెదక్), బి.అంజి (హన్మకొండ), లాంగ్‌జంప్‌లో అభిషేక్(టీఏఏ), ఎర్రోళ్ల తేజ(మెదక్), జి.జయ్‌రాకేష్(భద్రాద్రి కొత్తగూడెం) ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. ఇక షాట్‌పుట్‌లో షేక్ మజీద్‌పాషా, షేక్ ఆఫ్తాబ్(ఖమ్మం) మొదటి రెండు స్థానాలు సాధించారు. అలాగే, మహిళల విభాగం 100 మీటర్ల పరుగులో పి.రామస్వామి(రంగారెడ్డి), బి.రాగవర్షిణి(హైదరాబాద్), ఎం.డీ.సైరాభాను(రంగారెడ్డి), 400 మీటర్ల పరుగులో ఎ.మైథిలి(ఖమ్మం), డి.భార్గవి(కరీంనగర్), పి.లిఖిత(ఖమ్మం), 800 మీటర్ల పరుగులో బానోత్ ఇందుప్రియ, పెండ్ర కామాక్షి(ఖమ్మం), బి.మానస(నాగర్‌కర్నూల్), షాట్‌పుట్‌లో హజీరా ఫాతిమా (ఖమ్మం), జి.హిమసింధు(భద్రాద్రి కొత్తగూడెం), జె.నిఖిత(నిర్మల్), హైజంప్‌లో జె.రంజిత(కరీంనగర్), పి.ఉమ(నిజామాబాద్), పి.నవ్య(భద్రాద్రి కొత్తగూడెం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అలాగే, 5వేల మీటర్ల పరుగులో కె.విశాలక్ష్మి(హైదరాబాద్), ఎస్.మానస(జగిత్యాల) మొదటి రెండు స్థానాల్లో నిలవగా, డిస్కస్ త్రోలో జి.హిమసింధు (యాదాద్రి భువనగిరి) విజయం సాధించారు.

దాడి ఘటనలో ఎంపీటీసీ అరెస్ట్

చుంచుపల్లి: భూ వివాదం నేపథ్యంలో జరిగిన ఘర్షణ కేసులో మండలంలోని సర్వారం ఎంపీటీసీ బానోత్ విజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ సుమన్ కథనం ప్రకారం.. చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెలలో భూ వివాదంలో గుగులోతు తారాబాయి అనే మహిళ కుమారుడు సందీప్‌ను ఎంపీటీసీ కర్రతో కొట్టి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పరారు కాగా, బుధవారం రాత్రి వరంగల్‌లో అరెస్ట్ చేశారు. రిమాండ్ నిమిత్తం గురువారం కోర్టుకు తరలించారు. బానోత్ విజయ్‌పై గతంలో కూడా కొన్ని కేసులు నమోదుకావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో అతనిపై రౌడీషీట్ తెరుస్తామని ఎస్సై తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి సీఎం కృషి

ఎంపీ నామా నాగేశ్వరరావు


ఏదులాపురం సొసైటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎంపీ నామా, ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి


చెన్నారం ఆలయంలో ఎంపీ నామ, తదితరులు

ఖమ్మంరూరల్: తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిధులు కేటాయిస్తున్నారని ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని రెడ్డిపల్లిలో మారెమ్మతల్లి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం గురువారం జరగగా ఎంపీ పాల్గొన్నారు. యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధే ప్రభుత్వ కృషికి నిదర్శమని తెలిపారు. ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ మట్టా వెంకటేశ్వరరావు నేతృత్వంలోని పాలకమండలి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. త్వరలోనే వెంకటగిరి నుండి కోదాడ క్రాస్ వరకు నాలుగులేన్ల రహదారి విస్తరణ, కోదాడ క్రాస్ నుండి నాయుడుపేట వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే, ఏదులాపురం సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన జర్పుల లక్ష్మణ్‌నాయక్ ప్రమాణ స్వీకారం చేయగా ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆతర్వాత ఏదులాపురంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్, నాయకులు బెల్లం వేణు, మట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం వైభవంగా నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈకార్యక్రమంలో ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొని ఆలయ అభివృద్ధి కోసం రూ.2,01,116 అందించారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మధుకాన్ ఈడీ నామ కృష్ణయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.యాతర్వాత పాలేరు శాసనసభ్యులు కందాళ ఉపేందర్‌రెడ్డి కూడా పూజలు చేసి ఆలయ అభివృద్ధికి రూ.6లక్షలు అందించారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని కాపాడిన పోలీసులు


కిరణ్‌ను కుటుంబీకులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ ఉపేందర్

ఎర్రుపాలెం: మండల కేంద్రంలో రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని యత్నించగా పోలీసులు బ్లూ కోట్ కానిస్టేబుల్ ఉపేందర్ కృష్ణ కాపాడారు. ఎస్‌ఐ ఎం.సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరుకు చెందిన వేముల కిరణ్‌కుమార్‌కు ఆయన బంధువులతో ఘర్షణ జరగగా తాను చనిపోతానని చెప్పి ఎర్రుపాలెం వచ్చాడు. స్థానిక రైల్వే గేట్ నుండి రేమిడిచర్ల వైపుకు ట్రాక్‌పై వెళ్తూ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబసభ్యులు, బంధువులకు వీడియో కాల్ చేసి చెప్పాడు. దీంతో వారు డయల్ 100కు ఫోన్ చేయగా ఎస్‌ఐ ఎం.సురేష్ గూగుల్ లొకేషన్ ద్వారా కిరణ్‌కుమార్‌ను గుర్తించి బ్లూకోట్ కానిస్టేబుల్ బూరా ఉపేందర్ కృష్ణను పంపించగా ఆయన కిరణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చాడు. అక్కడ కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఆటోడ్రైవర్ మృతి

ఆర్‌ఎంపీ వైద్యుడే కారణమని ఆందోళన


కృష్ణ (ఫైల్)

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో బుధవారం రాత్రి అస్వస్థకు గురైన ఆటోడ్రైవర్‌కు ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయిస్తుండగా ఆయన మృతి చెందాడు. దీంతో ఆర్‌ఎంపీ చికిత్సలో లోపమే కారణమని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. అన్నారుగూడెంకు చెందిన కొంగల కృష్ణ(45) అస్తమాతో ఇబ్బంది పడుతుండగా రాత్రి 10 గంటల సమయాన ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. దీంతో ఆయన ఇంజక్షన్ చేయగా కాసేపటికి పరిస్థితి విషమించడంతో ఖమ్మం తీసుకెళ్లమని చెప్పాడు. ఖమ్మం తీసుకెళ్తుండగా కృష్ణ మృతి చెందడంతో ఆయన బంధువులు మృతదేహాన్ని ఆర్‌ఎంపీ ఇంటి ముందు ఉంచి అర్ధరాత్రి వరకు ఆందోళన చేపట్టారు. చివరకు ఆర్‌ఎంపీ పరిహారం చెల్లిస్తానని అంగీకరించడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతుడి కుమారుడు జీవన్‌కుమార్ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి...


కొండయ్య(ఫైల్)

మధిర: మండలంలోని మహదేవపురానికి చెందిన పణితి కొండయ్య(43) వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. కొద్దిరోజులుగా నమోదవుతున్న అత్యధిక ఉష్ణోగ్రతలు, వడగాలులతో ఆయన వడదెబ్బ బారిన పడి మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

చింతకాని: చింతకాని–బోనకల్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి గురువారం జారి పడిన ఏపీలోని ప్రకాశం జిల్లా లింగసముద్రంకు చెందిన చల్లా కొండల్‌రెడ్డి(40) మృతి చెందాడు. విజయవాడ వైపు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రైలు నుంచి ఆయన జారి పడ్డాడు. మృతుడి వద్ద గుర్తింపు కార్డుల ఆధారంగా కొండల్‌రెడ్డిగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చామని జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు. అనంతరం ఆయన మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.